సాక్షి గుంటూరు

శనివారం। 18। ఫిబ్రవరి। 2023



తరలిన ప్రభలు

చిలకలూరిపేట: పురుషోత్తమపట్నం నుంచి 10 ప్రభలు కోటప్పకొండకు తరలాయి. ఇందులో ఆరు విద్యుత్ ప్రభలు. పూజల్లో మంత్రి రజని పాల్గొనటంతో పాటు ఎడ్లబండిని తోలి సందడి చేశారు.



పోలీసులకు సహకరించాలి

నరసరావుపేట రూరల్: తిరునాళ్లకు వచ్చే భక్తులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ రవి శంకర్‌రెడ్డి అన్నారు. కోటప్పకొండ జెడ్పీ హైస్కూల్‌లో పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

మహాశివరాత్రికి ప్రత్యేక వైద్య బృందాలు

గుంటూరుమెడికల్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు తెలిపారు. తాళ్లాయపాలెం, చేబ్రోలు, వడ్లమూడి క్వారీ, సంగంజాగర్లమూడి, మేడికొండూరు కై లాసగిరి వద్ద వైద్యులు, వైద్య సిబ్బందితో ప్రత్యేక వైద్య బృందాలు ఏర్పాటు చేశామన్నారు. 18వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 19వ తేదీ మధ్యాహ్నం వరకు ప్రత్యేక వైద్య బృందాలు ఆయా శివాలయాల వద్ద అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

నరసరావుపేట రూరల్: తిరునాళ్లకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొండకు వచ్చే అన్ని రహదారులను సిద్ధం చేసినట్లు తెలిపారు. యల్లమంద బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో ప్రభలు, వాహనాల రాకపోకలు యథావిధిగా సాగించవచ్చన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు వన్‌వేను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రోటోకాల్ వాహనాలు మినహా ప్రైవేటు వాహనాలకు కొండపైకి అనుమతిలేదని స్పష్టం చేశారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, అరటి పండ్లు, బిస్కెట్లు అందించే విధంగా చర్యలు తీసుకున్నట్టు వివరించారు.

మినరల్ వాటర్ ప్లాంట్లలో విజిలెన్స్ తనిఖీలు



నగరంపాలెం: ఉమ్మడి జిల్లాలోని మినరల్ వాటర్ ప్లాంట్‌లలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు నగరంలోని రింగ్‌రోడ్డులో భీమినేని ఎంటర్‌ప్రైజెస్, డొంకరోడ్డులోని శ్రీలక్ష్మీచెన్నకేశవ వాటర్ ప్లాంట్, బాపట్లలోని ఆర్కే వాటర్ ప్లాంట్, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని అమృత మినరల్ వాటర్ ప్లాంట్‌లలో తనిఖీలు కొనసాగాయి. ప్యాకింగ్ లైసెన్సు, ఫుడ్ లైసెన్సు, జీఎస్టీ రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలు పరిశీలించారు. నీటి నమూనాలు సేకరించారు. తనిఖీల్లో సీఐ ఎ.శ్రీహరి రావు, లక్ష్మారెడ్డి, ఎస్సై రామచంద్రలు, ఏఈఓ కె.మల్లికార్జునరెడ్డి, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

రాత్రి 10 గంటల నుంచి మిర్చి దిగుమతులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో సోమవారం నుంచి రాత్రి 10 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మాత్రమే మిర్చి బస్తాల దిగుమతులు ఉంటాయని మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యార్డుకు సగటున రోజుకు సుమారు 1.25 లక్షల బస్తాలు వస్తున్నాయని పేర్కొన్నారు. యార్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మాత్రమే మిర్చి బస్తాలను లోనికి అనుమతించడం జరుగుతోందని, మార్కెట్ కమిటీకి రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ పరీక్షలపై కాల్ సెంటర్ ఏర్పాటు

గుంటూరుఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు గుంటూరులోని ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఐవో జి. సునీత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హాల్ టికెట్లకు సంబంధించిన సమస్యలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సమస్యలను నేరుగా 0863–2228528 నంబర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరీక్షలకు సంబంధించిన సమాచార సేకరణ, ఫిర్యాదుల నమోదుకు ఇదే నంబర్‌ను వినియోగించుకోవాలని తెలిపారు.

1,09,460 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,04,921 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 1,09,460 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, సెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 77,785 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సంబరానికి సర్వం సిద్ధం

నేడు కోటప్పకొండ తిరునాళ్ల

- ముస్తాబైన త్రికోటేశ్వరస్వామి ఆలయం
- 25 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- 535 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు
- విధులు నిర్వహించనున్న 2,500 మంది పోలీసులు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విద్యుద్దీపకాంతుల్లో మెరిసిపోతున్న కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణం

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటప్పకొండపై నిర్వహించే తిరునాళ్ల మహోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రముఖ ఉత్సవాల్లో ఒకటిగా నిలిచే కోటప్పకొండ తిరునాళ్లకు ఈ ఏడాది 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శనం కల్పించడంతో పాటు క్షేమంగా తమ గమ్యస్థానాలకు తిరిగి వెళ్లేవిధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. రెండు నెలలుగా అధికారులు తిరునాళ్ల ఏర్పాట్లలో నిమగ్నమై పనులను పూర్తిచేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

తెల్లవారుజాము నుంచే దర్శనానికి అనుమతి..

త్రికోటేశ్వరస్వామికి తెల్లవారుజామున 3 గంటలకు బిందెతీర్థంతో అర్చక స్వాములు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ పూర్తిచేసి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆరు క్యూలైన్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500, అభిషేక దర్శనం, వీఐపీ దర్శనాన్ని భక్తులకు కల్పించనున్నారు. ఈ మేరకు క్యూకాంప్లెక్స్‌ను సిద్ధం చేశారు. మధ్యాహ్నం వేళ ఎండవేడిమికి భక్తులు ఇబ్బందులు పడకుండా చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ ఈ ఏడాది నూతనంగా నిర్మించిన రేకుల షెడ్డు భక్తులకు ఉపయోగకరంగా ఉంది. స్వామి ప్రసాదాలైన లడ్డూ, అరిసెలను సిద్ధం చేశారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేసేందుకు చర్యలు తీసుకున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు..

తిరునాళ్లకు తరలివచ్చే యాత్రికులను చేరవేసేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతుంది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, గుంటూరు, అద్దంకి, ఒంగోలు నుంచి బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 535 బస్సులను తిరునాళ్ల కోసం వినియోగిస్తారు. కొండ దిగువ భాగంలో రెండు తాత్కాలిక బస్టాండ్‌లతో పాటు ఐదు క్యాంప్‌లను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. నరసరావుపేట నుంచి 265 బస్సులు, చిలకలూరిపేట నుంచి 120, వినుకొండ 35, అద్దంకి 25, ఒంగోలు 45, చీరాల 45, కొండ కింద నుంచి పైకి సప్తగిరి బస్సులు 60, వీఐపీల కోసం 20 సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశారు. దాదాపు 1,200 మంది సిబ్బందిని విధుల్లో నియమించారు.

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి..

తిరునాళ్ల జరిగే కొండ దిగువ ప్రాంతంలో పారిశుద్యం నిర్వహణ, తాగునీటి కోసం ప్రభుత్వ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. నరసరావుపేట–కోటప్పకొండ–చిలకలూరిపేట రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. ఆర్‌అండ్‌బీ, విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో కొండ దిగువన విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎలాంటి ఆవాంతరాలు తలెత్తకుండా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. ఆర్ డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో రెండు లక్షల మంచి నీటి ప్యాకెట్లను సిద్ధం చేశారు. కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నారు. చిలకలూరిపేట మేజర్ కెనాల్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే ప్రాంతంలో మొబైల్ టాయిలెట్స్, మహిళల కోసం డ్రెసింగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

17 భారీ విద్యుత్ ప్రభలు రాక..

కోటయ్య సన్నిధికి 17 భారీ విద్యుత్ ప్రభలు రానున్నాయి. ఇప్పటికే గురవాయపాలెం, కాకాని ప్రభలు కొండకు చేరుకున్నాయి. పురుషోత్తపట్నం గ్రామం నుంచి ఐదు ప్రభలు, కావూరు, కమ్మవారిపాలెం, కోమటినేనివారిపాలెం, అమీన్‌సాహెబ్‌వారిపాలెం, యడవల్లి, అప్పాపురం, మద్దిరాల, గోవిందాపురం, ఉప్పలపాడు గ్రామాల నుంచి ప్రభలు కొండకు బయలుదేరాయి.

బ్రిడ్జిని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎస్పీ..

తిరునాళ్ల ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపులో కీలకమైన చిలకలూరిపేట మేజర్ కెనాల్‌పై ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జిని ఎమ్మెల్యే, ఎస్పీ ప్రారంభించారు. అనంతరం కొండ మీదకు చేరుకుని వీఐపీ, ప్రోటోకాల్, సామాన్య భక్తుల క్యూలైన్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పట్టువస్త్రాలు సమర్పించనున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

మహాశివరాత్రి సందర్భంగా త్రికోటేశ్వరస్వామికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ జీవోను జారీ చేశారు. శనివారం సాయంత్రం 6 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, వెండి ప్రభను స్వామికి సమర్పించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి



మేజర్ కెనాల్‌పై బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



తిరునాళ్ల ప్రాంతంలో ఏర్పాటైన జెయింట్ వీల్, తాత్కాలిక దుకాణాలు

రూ.326 కోట్లతో అభివృద్ధి

- 57 డివిజన్లలో రూ.202 కోట్లతో పనులు పూర్తి
- పార్టీలకతీతంగా నగరాభివృద్ధి
- మేయర్ కావటి మనోహర్‌నాయుడు



గుంటూరు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కార్పొరేటర్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ నెహ్రూనగర్: గుంటూరు నగరంలో పార్టీలు, కులాలు, ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం నగర మేయర్ అధ్యక్షతన నగర పాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల మరణించిన వైఎస్సార్ సీపీ 48వ డివిజన్ కార్పొరేటర్ తనుబుద్ధి కృష్ణారెడ్డికి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కార్పొరేటర్లు ఘన నివాళులర్పించారు. సభ్యులంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ గుంటూరు నగరంలో 2020 నుంచి రూ.326 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే 57 డివిజన్లలో రూ.202 కోట్లతో పనులు పూర్తయ్యాయని చెప్పారు. రూ.33 కోట్ల పనులు ప్రారంభమయ్యాయని, రూ.72 కోట్ల విలువైన పనులు టెండరింగ్ స్టేజ్‌లో ఉన్నట్లు వివరించారు. టీడీపీ వార్డుల్లో సైతం రూ.3 నుంచి రూ.8 కోట్ల వరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

కౌన్సిల్‌లో చర్చకు వచ్చిన ప్రధాన అంశాలు

అనధికార లేఅవుట్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు అధికారులను నిలదీశారు. దీంతో దీనిపై విచారణ చేపట్టాలని మేయర్ కావటి ఆదేశించారు. వెహికల్ షెడ్ నిర్వహణ ఖర్చులపై భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో జాబ్ చార్ట్ లేదని, రికార్డ్ రూము జారీ చేసే డిమాండ్ నకళ్ల జారీలో రూ.కోట్లలో అవినీతి జరిగిందని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు పట్టుబట్టారు. నగరంలో హోర్డింగ్స్ నిర్వహణ ట్యాక్స్ వసూళ్లలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, దీనిపై విజిలెన్స్ ఎంక్వైరీ వేయించాలని కార్పొరేటర్ షేక్ రోషన్ డిమాండ్ చేశారు. పలు వార్డుల్లో వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు.

ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణాలు చేపట్టాలి

గుంటూరు నగరంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందని, నగరంలో పలు ప్రధాన ప్రాంతాల్లో ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణాలు చేపట్టాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ అధికారులు తగినవిధంగా పనిచేయడం లేదని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 9 నిర్మాణాలకు రైల్వే శాఖ అనుమతులు మంజూరు చేసిందన్నారు. ప్రాధాన్యత క్రమంలో పనులు ముందుకెళతాయని తెలిపారు.

20 రోజుల్లో మంజూరుకు అవకాశం

శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణకు 15 నుంచి 20 రోజుల్లో మంజూరు అయ్యే అవకాశం ఉందని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. దీనికి సంబంధించి ఎంపీలతో చర్చలు జరిపామని, వారు రైల్వే శాఖతో చర్చించి మంజూరు చేయించే పనిలో ఉన్నారన్నారు. మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. సచివాలయాల వారీగా ఎన్ని మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయో లెక్క తేల్చాలన్నారు.

క్రైస్తవ శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలి

గుంటూరు నగరంలో క్రైస్తవ శ్మశానవాటికల్లో స్థలం లేకపోవడంతో సమాధులు ఒకదానిపై ఒకటి కట్టాల్సిన పరిస్థితి నెలకొందని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న అంబేడ్కర్ భవన్, జాషువా భవన్‌ను పూర్తి చేసేందుకు కౌన్సిల్ తగిన కృషి చేయాలన్నారు.

ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలి

జున్ను షాహీద్ నగర్‌లో డ్రైనేజీ పైపులపై ఇళ్ల నిర్మాణం చేసుకుని జీవిస్తున్న క్రమంలో ప్రస్తుతం పైపులైను లీకేజీ కారణంగా ఇళ్లు తొలగించిన వారికి తగిన న్యాయం చేయాలని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా ప్రస్తావించారు. నగరంలో బీ–ఫారం పట్టాలకు పేరు మార్చుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. పాతగుంటూరు పోలీస్ స్టేషన్ ఐలాండ్ వద్ద మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. బీఆర్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టాలన్నారు.

టీడీపీ కార్పొరేటర్ల మధ్య రగడ

42వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ వేముల శ్రీరామ్ ప్రసాద్ తన డివిజన్ పరిధిలో నవ భారత నగర్‌లో సుమారు 200 గజాలకుపైగా నగరపాలక సంస్థ రోడ్డును ఆక్రమించుకుని ఇల్లు నిర్మించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు విన్నవించినప్పటికీ స్పందన లేదన్నారు. సదరు స్థలంపై అధికారులే కోర్టును ఆశ్రయించాలని సూచిస్తున్నారని కౌన్సిల్‌లో ప్రస్తావించారు. దీనిపై స్పందించి టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి మాట్లాడుతూ సదరు భవనం తనకు కావాల్సినవాళ్లదని, అవసరం అయితే ఆ స్థలాన్ని కార్పొరేషన్‌కు వారి ద్వారా రాయించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

ఎంపీ గల్లా జయదేవ్ కనిపించడం లేదు

- గుంటూరు కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నిరసన
- టీడీపీ, వైఎస్సార్ సీపీ సభ్యుల మధ్య వాగ్వివాదం, తోపులాట
- ఎంపీ మిస్సింగ్ అంటూ ప్ల కార్డులు ప్రదర్శించిన వైఎస్సార్ సీపీ సభ్యులు
- నిధుల కేటాయింపు అంశంపై రేగిన రచ్చ
- మేము పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్నాం
- ఎంపీ మాత్రం టీడీపీ సభ్యులకే నిధులు ఇచ్చారంటూ లెక్కలు చెప్పిన మేయర్



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌లతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ కార్పొరేటర్

సాక్షి ప్రతినిధి గుంటూరు: గుంటూరు ప్రజల ఓట్లతో గెలుపొందిన టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ గుంటూరులో మాత్రం కనిపించడం లేదంటూ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ మిస్సింగ్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. శుక్రవారం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో తమ డివిజన్లలో పనులు జరగడం లేదంటూ తెలుగుదేశం కార్పొరేటర్లు ప్రస్తావిస్తుండగా మేయర్ కావటి మనోహర్‌నాయుడు జోక్యం చేసుకుని తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్నట్లుగా తాము కూడా పార్టీలకతీతంగా, కులాలు, ప్రాంతాలకతీతంగా నగరాభివృద్ధి చేపట్టామని, టీడీపీ వారు గెలిచిన డివిజన్లలో కూడా రూ.3 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తెలుగుదేశం గెలిచిన 38వ డివిజన్‌లో నాలుగు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టగా, ఎంపీ కేవలం పది లక్షల రూపాయలు ఇచ్చారని అనడంతో తెలుగుదేశం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. దీంతో తెలుగుదేశం సభ్యుడొకరు లేచి తాము నిధులు కావాలని అడుక్కుంటే ఇచ్చారని, మీరు కూడా వస్తే ఇస్తారంటూ వాదనకు దిగారు. దీనిపై అధికార పార్టీ కార్పొరేటర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గుంటూరు ఎంపీ అందరిని సమానంగా చూడాలని, కేవలం మీ పార్టీ సభ్యులకే నిధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. తాము గెలిచి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకూ ఎంపీని తాము చూడలేదని, ఎంపీ మిస్సింగ్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అసలు గుంటూరులో ఉండని వ్యక్తిని ఢిల్లీ వరకూ వెళ్లి నిధులు అడగాలా? అంటూ ప్రశ్నించారు. దీంతో మాటామాట పెరిగి తీవ్ర వాగ్వివాదానికి, తోపులాటకు దారితీసింది. టీడీపీ కార్పొరేటర్లు మహిళా కార్పొరేటర్లను సైతం తోసే ప్రయత్నం చేయడంతో ఎస్సీ మహిళ కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, బూసి రాజలత టీడీపీ సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. ఎంపీ గల్లాపై మిస్సింగ్ కేసు నమోదు చేయించాలని మేయర్‌ను కోరారు. అనంతరం మేయర్ కావటి మనోహర్‌నాయుడు జోక్యం చేసుకుని ఎంపీ గల్లా జయదేవ్ తనకు రూ.2.50 కోట్ల దాకా ఎంపీ ల్యాండ్స్ నిధులు వస్తే దానిలో కేవలం రూ.1.20 కోట్లు ఖర్చు చేశారని, అది కూడా టీడీపీ వార్డు సభ్యులకు మాత్రమే మంజూరు చేశారని లెక్కలు చూపడంతో టీడీపీ నాయకులు మిన్నకుండిపోయారు.

సాగునీటి సరఫరా సక్రమంగా జరగాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు చానల్, అప్పాపురం చానల్‌లో గుర్రపు డెక్కా అధికంగా పెరిగిందన్నారు. తొలగించిన కొన్ని రోజుల్లోనే తిరిగి పెరుగుతోందని, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాలువల్లో నీరు లేని సమయంలో శాశ్వతంగా తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మొక్కజొన్న, జొన్న, శనగ పంటలు చేతికొచ్చే సమయానికి సేకరణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్వింటా శనగలు మార్కెట్‌లో రూ.4,200 నుంచి రూ.4,300 ధర పలుకుతున్నాయని, శనగలకు ప్రభుత్వం రూ.5,300 మద్దతు ధర ఇస్తోందన్నారు. 2,500 టన్నుల శనగలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని తెలిపారు. క్వింటా మినుములు రూ.6,600, పెసలు రూ.7,700, మొక్కజొన్న రూ.1,960కు ప్రభుత్వ మద్దతు ధర ఇస్తోందని వివరించారు. రైతులు తమ ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పంట సేకరణ కేంద్రాల్లో అమ్ముకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, ఇరిగేషన్ ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు, మార్క్‌ఫెడ్ డీఎం కృష్ణారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వరులకు మంగళగిరి చేనేత వస్త్రాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): మహా శివరాత్రిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు శివభక్త మార్కండేయ వంశీకులు శుక్రవారం పట్టువస్త్రాలను సమర్పించారు. మార్కండేయ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, రాధా దంపతులు, ట్రస్ట్ దామర్ల వెంకట నరసింహం పట్టు వస్త్రాలను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మల్లేశ్వర స్వామి వార్ల బాలాలయంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు జరిపించుకున్న అనంతరం 14 సంప్రదాయ వెదురు బుట్టలలో వస్త్రాలు, విభూది శ్వేత పట్టువస్త్రాలు, ఫలపుష్పాలు, ఇతర పూజా సామగ్రిని స్వామి వారికి సమర్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా ఆలయ అధికారులు ప్రసాదాలను బహూకరించారు. భక్త మార్కండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఈ వస్త్రాలను ప్రత్యేకంగా తయారు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు, చేనేత ప్రముఖులు పాల్గొన్నారు.



ఆప్కో చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న దుర్గగుడి చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్




పట్నంబజారు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. గుంటూరులో అభివృద్ధి దినదినాభివృద్ధి చెందుతోందని, ఇదీ గ్రాఫిక్స్ కాదన్న విషయాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నేతలు గుర్తించాలని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో స్థానిక పార్కులు, రోడ్లు, బిల్డింగ్‌లు పునరుద్ధరణ చేసి చూపిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మన రాష్ట్రం పారిశ్రామికంగా, ఆర్థికంగా దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆకర్షిస్తూ ముందుకు దూసుకువెళ్తోందన్నారు. 2021–22లో 11.43 శాతం జీఎస్‌డీపీతో దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా ఏపీ ఉందన్నారు. రాష్ట్రంలో వృద్ధి రేటు చూసి పురోగతి సాధించిందా.. తిరోగమనంలో ఉందో చంద్రబాబుకు తెలియటం లేదా అని ప్రశ్నించారు. జిల్లాలో 70కిపైగానే అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు అయ్యాయని, ఇప్పటికే 32 క్లినిక్‌లు మరింత అభివృద్ధి చెందాయన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 49.91 కిలోమీటర్ల మేర విస్తరించిన పేరేచర్ల– కొండమోడు రహదారి రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. 2025 నాటికి ప్రసిద్ధ గుంటూరు సన్నం మిర్చి ఎగుమతులను రూ.4,661 కోట్లకు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఎగుమతి కార్యాచరణ ప్రణాళికను పంపిందన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన సందర్భంగా సజ్జన్ జిందాల్ పేర్కొన్న మాటలు అక్షర సత్యాలని నిరూపించేలా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోందని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ స్పష్టం చేశారు.

మల్లేశ్వరస్వామి కల్యాణానికి వేళాయె..

- పెదకాకాని శివాలయంలో భారీగా ఏర్పాట్లు
- పరిశీలించిన ఎమ్మెల్యే కిలారి
- వనదుర్గాదేవిగా భ్రమరాంబ అమ్మవారు దర్శనం



పెదకాకాని శివాలయంలో వనదుర్గాదేవిగా భ్రమరాంబ అమ్మవారు



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పెదకాకాని శివాలయం

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో రెండోరోజు అమ్మవారు వనదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, పంచహారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 7 గంటలకు గ్రామ బలిహరణ, 8.30లకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం ఒంటి గంటకు మహానివేదన, నిత్యోపాసన, గ్రామబలిహరణ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పంచహారతులు ఇచ్చారు.

మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం

భ్రమరాంబ అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులను దర్శనం ఇవ్వనున్నారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని రాత్రి 11 గంటలకు లింగోద్భవకాలమున స్వామికి ఏకాదశ ద్రవ్యములతో రుద్రాభిషేకం, 12 గంటలకు రావణబ్రహ్మ వాహనంపై ఎదుర్కోలోత్సవం, తెల్లవారు జామున 2 గంటలకు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహా శివరాత్రి కల్యాణ బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం అంతటా విద్యుత్ కాంతులతో కళకళలాడింది.

ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

ప్రతి భక్తునికి స్వామివారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సూచించారు. పెదకాకాని శివాలయంలో మహా శివరాత్రి పర్వదినం పుస్కరించుకుని చేపట్టిన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యేకు అర్చకులు, వేదపండితులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఏసీ ఎన్.శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, సర్పంచి గోళ్ళ స్వరూపరాణి పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో నగదు రహిత సేవలందించాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: పేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా వివిధ ఆసుపత్రులు అందించే సేవలు పూర్తి పారదర్శకంగానూ, నగదు రహితంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా క్రమ శిక్షణ సంఘం సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవలను అందించే క్రమంలో రోగుల పరిస్థితిని గుర్తించాలన్నారు. ఇప్పటికీ కొన్ని ఆసుపత్రుల్లో నిర్లక్ష్యపు సమాధానాలు, సేవలను అందించేటప్పుడు నిర్లక్ష్యాన్ని తాము గమనిస్తున్నామన్నారు. పదే పదే ఫిర్యాదులందితే సంబంధిత ఆసుపత్రులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. 139 ఎఎస్ఎం మొబైల్ యాప్‌తో సహా 208 ఫిర్యాదులందాయన్నారు. 5 హాస్పిటల్ యాజమాన్యాలపై జరిమానా వేసామన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, డీసీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్‌మోహన్, డీసీహెచ్ఎస్ డాక్టర్ హనుమంతరావు, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్ర రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం మన బాధ్యత

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఖర్చుకు వెనుకాడకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని, దీనిని గుర్తించి విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత మనపై ఉందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో వైద్య శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వైద్య శాఖలో ప్రవేశపెట్టిన కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రతి కుటుంబానికి చేరాలన్నారు. గ్రామాల్లో పర్యటించి అవసరమైన వారికి వైద్యం, మందులు అందించాలన్నారు. ఓపీ పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. రోగులతో ప్రేమగా మాట్లాడడం, వారికి మనోధైర్యం కలిగించడం మన బాధ్యతన్నారు. పీహెచ్‌సీల్లో సేవలు అందించే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మెమోలు జారీ చేయాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య సేవలు పొందిన వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో, మండల స్థాయిలో చిన్నారులకు, గర్భిణులకు రక్తహీనతను గుర్తించి, సరైన పోషకాహారాన్ని అందించే చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో పూర్తయిన అర్బన్ హెల్త్ సెంటర్స్‌ను వెంటనే ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు తప్పక పాటించాలన్నారు. ప్రతి వారం అధికారులు ప్రభుత్వాసుపత్రుల్లో, పీహెచ్‌సీల్లో అమలవుతున్న వైద్య సేవలను గమనించడం, ఇబ్బందులను వెంటనే పరిష్కరించడం చేయాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, డీసీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్‌మోహన్, డీసీహెచ్ఎస్ డాక్టర్ హనుమంతరావు, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆవులలో పిండమార్పిడి పద్ధతికి అవకాశాలు

డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బాలశంకరరావు

గుంటూరు రూరల్: పశువుల్లో పిండ మార్పిడి పద్ధతి ద్వారా మేలైన ఒంగోలు జాతి, గిర్ దూడల అభివృద్ధికి అన్ని అవకాశాలు సిద్ధంగా ఉన్నాయని డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ డి.బాలశంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచి నాటు ఆవులలో ఈ పిండమార్పిడి పద్ధతి ద్వారా మేలైన జాతులను వృద్ధి చేసుకోవచ్చన్నారు. పిండమార్పిడి విధానాలను చేసేందుకు ఎంపిక చేయబడిన ఆవులలో మాత్రమే మంచి ఫలితాలు అందుతాయని వివరించారు. అందులో భాగంగా ఆవులను ఎంపిక చేసేప్పుడు ఆవులు ఇంతకు ముందు ఎటువంటి గర్భకోశ సంభందిత వ్యాధులు కలిగి ఉండరాదన్నారు. తొలిచూరు ఆవులను ఎంపిక చేయకూడదన్నారు. ఈనిన 60 రోజుల నుంచి 4 నెలలలోపు ఆవులను ఎంపిక చేసుకోవాలన్నారు. ఆసక్తిగల రైతులు వివరాలకు తమ పరిధిలోని పశు సంవర్థక శాఖ అధికారులు చేబ్రోలు ఏవీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సాంబశివరావు (9866872167), గుంటూరు చల్లావారిపాలెంకు చెందిన వీఏఎస్ వీడీ డాక్టర్ వై.ఈశ్వరరెడ్డి (9492685803), దొడ్లేరు, క్రోసూరు వీఏఎస్ వీడీ డాక్టర్ సీహెచ్ మల్లయ్య(9492549895), రెంటచింతల వీఏఎస్ వీడీ డాక్టర్ షేక్ బషీర్(7780125129), రొంపిచర్ల, కర్లగుంట వీఏఎస్ వీఈ డాక్టర్ సాయిమహేష్‌రెడ్డి (9533891604) వైద్యులను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

రైల్వే ట్రాక్ నెట్‌వర్క్‌లో ట్రాక్ మెషిన్ల పాత్ర కీలకం

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ అమిత్ గోయల్



శాటిలైట్ ట్రాక్ మెషిన్‌ను ప్రారంభిస్తున్న అమిత్ గోయల్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రైళ్లను సురక్షితంగా నడిపేందుకు రైల్వే ట్రాక్ నెట్‌వర్క్ నిర్వహణలో ట్రాక్ మెషిన్ల కీలకమని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ అమిత్ గోయల్ అన్నారు. స్థానిక నల్లపాడు రైల్వేస్టేషన్‌లోని శాటిలైట్ ట్రాక్ మెషిన్ డిపోను డివిజన్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి డీఆర్ఎం రామకృష్ణ అధ్యక్షత వహించారు. గోయల్ మాట్లాడుతూ 2020లో దక్షిణ మధ్య రైల్వేలో 75 ట్రాక్ మెషిన్లు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు మొత్తం ఎస్సీఆర్‌లో 150 యంత్రాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. గుంటూరు డివిజన్‌లో సొంతంగా 14 ట్రాక్ మెషిన్లు ఉన్నాయని చెప్పారు. నల్లపాడు వద్ద శాటిలైట్ ట్రాక్ మెషిన్ డిపో 10 టన్నుల కెపాసిటి ఉన్న ఈవోటీ క్రేన్‌తో సహా ఒక షెడ్‌తో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ట్రాక్ మెషిన్స్ ఆంజనేయులురెడ్డి, డివిజన్ ఏడీఆర్ఎం శ్రీనివాస్, సీనియర్ డీసీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫుల్ బ్రైట్ ఫెలోషిప్‌పై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని న్యూఢిల్లీకి చెందిన ఫుల్‌బ్రైట్ కమిషన్ భారతదేశ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఐ.జయభారతి పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫాంలో ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పీజీ విద్యార్థులకు, విశ్వవిద్యాలయం బోధనా సిబ్బందికి ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. జయభారతి మాట్లాడుతూ ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్‌లో ఫుల్ బ్రైట్ నెహ్రూ, ఫుల్‌బ్రైట్ కలాం వివిధ రకాల ఫెలోషిప్ పథకాలు ఉన్నయని వివరించారు. ఫెలోషిప్ పొందాలనుకునే ఆసక్తి ఉన్న విద్యార్థులు, బోధన సిబ్బందికి తగిన సహకారం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు పాల్గొన్నారు.

20 నుంచి వైద్య బృందం పర్యటన

గుంటూరు మెడికల్: ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపీహెచ్ఎస్)కు చెందిన న్యూఢిల్లీ వైద్య బృందం ఈనెల 20 నుంచి జిల్లాలో పర్యటిస్తున్నట్లు స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.రవికుమార్ తెలిపారు. డాక్టర్ రజత్‌రహన్, డాక్టర్ అర్పిత, దీక్షలు జిల్లాలో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు పర్యటించి ఆయా ఆసుపత్రుల్లో ఐపీహెచ్ఎస్ ప్రమాణాల ప్రకారం వైద్య సేవలు ఉన్నాయా లేవా అనే విషయాలను పరిశీలిస్తారన్నారు. 20వ తేదీ తెనాలి జిల్లా ఆసుపత్రి, 21వ తేదీ పొన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం, 22వ తేదీ పాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 24వ తేదీ గుంటూరు నగరంలోని బృందావన్‌గార్డెన్స్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తారని వెల్లడించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రత్యేక వైద్య బృందానికి తగు సమాచారం అందజేయాలని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ తెలిపారు.

పిడుగురాళ్ళ పురపాలక సంఘం

పత్రికా ప్రకటన

పిడుగురాళ్ళ పురపాలక సంఘ పరిధిలో ఈ క్రింద తెలిపిన ప్రదేశములయందు డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేషన్ ట్రాన్స్ఫర్ పద్ధతిపై పబ్లిక్ టాయిలెట్లను నిర్మాణము చేయుటకు ఆసక్తి గల వారి నుండి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ కోరడమైనది. సదరు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్‌ను ది.24-02-2023 సాయంత్రం 4.00గం॥ల లోపు మునిసిపల్ ఆఫీసు నందు సీల్డ్ కవర్‌లో అందజేయవలెను. సదరు సీల్డు కవర్లను సాయంత్రం 4.30గం॥లకు ఓపెన్ చేయబడును.

1) గుంటూరు బస్టాప్ నందు పే అండ్ యూజ్ టాయిలెట్లు మరియు ఏ.సి అండ్ నాన్ ఏ.సి వెయిటింగ్ హాల్, 2) ఆర్.సి.యం చర్చి ఎదురు వాయువ్యము మూలయందు పే అండ్ యూజ్ టాయిలెట్లు, 3) తహశీల్దార్ ఆఫీసు ఎదురు పే అండ్ యూజ్ టాయిలెట్లు.

కండిషన్స్:– 1) గతంలో చేసిన అనుభవం సర్టిఫికెట్ తప్పనిసరి, [illegible] 2) [illegible] రిటర్న్స్(లేటెస్ట్), 3) [illegible] మరియు [illegible] వివరములు తెలుపవలెను. పై మూడు ప్రాంతములయందు నిర్మాణము చేయు నిర్మాణములకు విడివిడిగా డిపియఫ్‌ఓటి దాఖలు చేయవలెను. 4) [illegible] ఎన్ని రోజులలో నిర్మాణము పూర్తి చేయుదురు మరియు ఎన్నిరోజుల తర్వాత ట్రాన్స్ఫర్ చేయుదురో తెలుపవలెను. 5) ఏ కారణమునైనా ఎటువంటి నోటీసు లేకుండా తిరస్కరించుటకు, ఆమోదించుటకు కౌన్సిల్ వారికి పూర్తి హక్కు కలదు.

సం/– కమీషనరు, పిడుగురాళ్ళ పురపాలక సంఘం

జిల్లా కలెక్టరు (పౌ.స.)వారి కార్యాలయము, గుంటూరు

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి.నెం. 370/2022-S7, తే. 17.02.2023

[illegible] 3062.85 క్వింటాళ్ల [illegible]

వరుస సంఖ్య	సీజ్ చేయబడిన బియ్యం నిల్వల పరిమాణం క్వింటాళ్లలో	బియ్యం నిల్వలు ఉన్న మండల స్థాయి పాయింట్ల వివరము
1	2100.18	ఎం.ఎల్.ఎస్. పాయింట్, గుంటూరు అర్బన్
2	237.82	ఎం.ఎల్.ఎస్. పాయింట్, గుంటూరు రూరల్
3	228.73	ఎం.ఎల్.ఎస్. పాయింట్, ప్రత్తిపాడు
4	16.45	ఎం.ఎల్.ఎస్. పాయింట్, మంగళగిరి
5	184.16	ఎం.ఎల్.ఎస్. పాయింట్, తాడికొండ
6	132.71	ఎం.ఎల్.ఎస్. పాయింట్, తెనాలి
7	217.50	ఎం.ఎల్.ఎస్. పాయింట్, పొన్నూరు
మొత్తం	3062.85	

వేలం జరుగు ప్రదేశము :– సంయుక్త కలెక్టర్ వారి చాంబర్, కలెక్టరేట్, గుంటూరు
తేది : 24.02.2023, సమయం 11.00 గంటలకు

నిబంధనలు: 1. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా ధరావత్తు రు. 1,00,000/- [illegible] 24.02.2023 ఉదయం 10.00 గంటల లోపు [illegible] (Un successful Bidder) [illegible] 10 రోజుల [illegible] 9. ఈ బహిరంగ వేలం [illegible]

సం/- జిల్లా కలెక్టరు (పౌ.స.) గుంటూరు.